ప్రజాశక్తి
సోమవారం 28, నవంబర్ 2022



రాజకీయ వేధింపులు ఆపాలి

ప్రజాశక్తి రొద్దం

ఆశా వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని సిఐటియు నాయకులు విమర్శించారు. ఆరోపించారు. ఆదివారం స్థానిక రొద్దకమ్మ దేవాలయం ఆవరణలో ఆశా వర్కర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు సాంబ, జిల్లా ప్రధాన కార్యదర్శి సౌభాగ్య, సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ ఆశావర్కర్లకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, ఉద్యోగ భద్రత , పిఎఫ్, ఈఎస్ఐ కల్పించాలని డిమాండ్ చేశారు. రాజకీయ,అధికారులు వేధింపులు పూర్తిగా ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్ల యూనియన్ నాయకురాలు శ్యామల, శ్రీదేవి, గౌరి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ఫలితాల అనంతరం డైరెక్టర్లతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న జెఎల్.మురళీధర్

జెఎల్.మురళీ ప్యానల్ విజయం

టౌన్ బ్యాంకు ఎన్నికల ఫలితాలు వెల్లడి
అనేక రోజుల ఉత్కంఠకు తెర

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సాధారణ ఎన్నికలకు మించి అనేక మలుపులు, ఉత్కంఠతతో గతేడాది నుంచి కొనసాగుతూ వచ్చిన టౌన్ బ్యాంకు సహకార బ్యాంకు ఎన్నికల ఫలితాలు ఎట్టకేలకు వెలువడ్డాయి. ఈ ఎన్నికల్లో మునుపటి ఛైర్మన్ జెఎల్ మురళీ ప్యానల్‌కు సంబంధించిన వారే మొత్తం 12 మంది డైరెక్టర్లుగా విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో అధికార వైసిపి మద్దతుదారులెవరూ పాల్గొనలేదు. పోటీపడిన రెండు ప్యానళ్లు కూడా ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీకి సంబంధించిన వారే ఉన్నారు. ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి మద్దతురుడిగానున్న మార్కెట్ మహేష్ ప్యానల్ ఉండగా ఇటువైపు జెఎల్.మురళీ ప్యానల్ ఉన్నారు. జెఎల్ మురళీ కూడా ముందు ప్రభాకర్ చౌదరి గ్రూపులోనే ఉన్నప్పటికీ గత ఎన్నికలకు ముందే జెసి.ప్రబాకర్‌రెడ్డి గ్రూపులో చేరారు. ఈ ఇద్దరు నాయకుల మధ్య ముందు నుంచి పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. దీంతో ఈ ఎన్నికలు అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి మద్దతుదారుల మధ్య కాకుండా ప్రతిపక్ష టిడిపిలోని గ్రూపు ఆధిపత్యపు పోరులాగానే సాగింది. అయితే ఈ ఎన్నికల వ్యవహారం మొత్తం ఏడాది కాలంగా సాగుతూనే వస్తూ వచ్చింది. ఈ ఏడాది మే 31వ తేదీన ఎన్నికలు జరిగాయి. 12 డైరెక్టరు స్థానాలకు జరిగిన ఎన్నికలకు 31 మంది పోటీపడ్డారు. 6972 ఓట్లకు గానూ 3070 ఓట్లు పోలయ్యాయి. అంటే 44.04 శాతం ఓట్లు ఈ ఎన్నికల్లో పోలయ్యాయి. ఎన్నికల అనంతరమే ఓట్ల లెక్కింపు జరగాల్సి ఉన్నప్పటికీ న్యాయపరమైన సమస్యలతో వాయిదాపడుతూ వచ్చాయి. తాజాగా ఓట్ల లెక్కింపునకు లైన్ క్లియర్ కావడంతో ఆదివారం నాడు ఓట్ల లెక్కింపు నగరంలోని ఎస్ఎస్‌బిఎన్ కళాశాలలో జరిగింది. ఓట్ల లెక్కింపు ప్రారంభమైన తరువాత అందరిలోనూ ఉత్కంఠతనే నెలకొంది. ఎవరిది పై చేయి కానుందోనని ఆసక్తిగా అందరూ గమనించారు. అయితే మొదటి నుంచి జెఎల్ మురళీ ప్యానల్‌కు సంబంధించిన వారే ముందంజలో ఉంటూ వచ్చారు. చివరకు 12 డైరెక్టరు స్థానాలను జెఎల్.మురళీ ప్యానల్ కైవసం చేసుకుంది.

ఎవరికి ఎన్ని ఓట్లు వచ్చాయి

జెఎల్. మురళీ (1671), కృష్ణకుమార్ పెరవలి (1784), జంగటి శెట్టి రామాంజినేయులు (1692), జి.సుబ్రమణ్యం (1640), మాగిశెట్టి చంద్రశేఖర్ (1634), జి.వెంకటాద్రి (1625), రమేష్ సుంకర (1616), భాస్కర్ రొళ్ల (1615), ఎస్.బాషా (1604), బావిగడ్డ రమణయ్య (1603), చింతా భాస్కర్ (1599), కె.రాధా (1581) ఓట్లు వచ్చాయి.

మామూళ్లు ఇచ్చుకో..కల్లు అమ్ముకో..

ఏదైనా చిన్న వ్యాపారం చేయాలన్నా వివిధ శాఖల అనుమతులు అవసరం. ఇక మద్యం, కల్లు వ్యాపారాలు అంటే నిబంధనలు కఠిన తరంగా ఉంటాయి. నకిలీ మద్యం, కల్లు ప్రాణంతకం కావడంతో వాటి విక్రయాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుంది. ఇందుకోసమే ఏర్పాటు అయిన ఎక్సైజ్ శాఖలో నిబంధనలు కష్ట తరంగా ఉంటాయి. అనుమతులు లేకుండా ఒక్క సీసా మద్యం కాని, కల్లు కాని విక్రయిస్తే కేసులు నమోదవుతాయి. విక్రయించిన వారు జైలుకెళ్లాల్సిందే. అయితే కల్తీకల్లు వ్యాపారం జోరుగా సాగుతున్నా పట్టించుకోకుండా మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు జోగుతుండడం గమనార్హం.

అనుమతులు లేకనే జోరుగా వ్యాపారం
ఏరులై పారుతున్న కల్తీకల్లు

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీ సత్యసాయి జిల్లాలో కల్లు దుకాణాల విక్రయాలకు సెప్టెంబర్ నెలకి కాల పరిమితి ముగిసింది. ఎక్సైజ్ శాఖ అనుమతులు లేకుండా అక్టోబర్ 1వ తేదీ నుంచి ఒక్క సీసా కల్లు కూడా అమ్మడానికి లేదు. అయితే ప్రభుత్వం నెల రోజులు అనుమతుల కాలపరిమితి పెంచుకోవడానికి కల్లు వ్యాపారులకు అవకాశం కల్పించింది. ఆ నెల రోజులు కూడా గడిచినప్పటికీ కల్లు వ్యాపారులు ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు పొందకుండానే జిల్లా వ్యాప్తంగా కల్లు వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. శ్రీ సత్యసాయి జిల్లాలోని హిందూపురం, మండకశిరా నియోజకవర్గాలు టాడి హబ్‌గా పేరొందాయి. జిల్లా వ్యాప్తంగా దాదాపు 400 దాక అధికారికంగా కల్లు దుకాణాలు ఉన్నాయి అధికార పార్టీ నేతల కనుసన్నల్లో, అధికార పార్టీకి చెందిన ప్రజా ప్రతినిదుల కనుసన్నల్లో అనుమతులు లేకుండానే నడిచే కల్లు దుకాణాలు వందల్లో ఉన్నట్లు తెలుస్తోంది. కల్లు దుకాణాల నిర్వహణకు సంబంధించి కాలపరిమితి ముగియడానికి ముందే వ్యాపారులు కాలపరిమితి పొడిగించుకోవడానికి ఎక్సైజ్‌శాఖకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఎక్సైజ్‌శాఖ, వ్యాపారుల మధ్య డీల్ కుదరకపోవడంతో ఇంతవరకు కాలపరిమితి పొడిగిస్తూ ఆ శాఖ ఉత్తర్వులు ఇవ్వలేదు. కాలపరిమితి ముగిసిన వెంటనే వ్యాపారాలను నిలుపుదల చేయాలి. అయితే అధికారులు వ్యాపారుల నుంచి భారీగా మాముళ్లు తీసుకుని వారి కనుసన్నల్లోనే వ్యాపారాలు జోరుగా సాగిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

వ్యాపారాల్లో అధికార పార్టీ నాయకులు

అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులతో పాటు హిందూపురంలో ఓ ప్రజాప్రతినిది సైతం కల్లు వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు నిర్వహించడానికి భయపడుతున్నట్లు తెలుస్తోంది. హిందూపురానికి చెందిన ప్రజా ప్రతినిధి ఒకరు పరిగి మండలం గొల్లపల్లి వద్ద డిపో నిర్వహణకు అనుమతులు తీసుకున్నట్లు తెలుస్తోంది. అక్కడ కల్తీ కల్లు సిద్ధం చేసి హిందూపురం, పరగి, లేపాక్షి మండలాల్లో దాదాపు 100 నుంచి 120 కౌంటర్లను ఏర్పాటు చేసి వ్యాపారాలు చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. పరిగి మండలం బీచుగానపల్లిలో వన్నప్ప అనే వ్యక్తి 11 మందితో సొసైటీని ఏర్పాటు చేసుకున్నారు. అధికారులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే అందులో ముగురిని తొలగించి, కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేసుకున్నట్లు సమాచారం. ఇలా ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు వ్యవహరిస్తున్నా ఎక్సైజ్ శాఖలో చలనం మాత్రం కనిపించడం లేదు.



హిందూపురం రూరల్ మండలంలో జోరుగా సాగుతున్న కల్లు వ్యాపారం

చెట్లు తక్కువ..కల్లు ఎక్కువ..

హిందూపురం, మడకశిర నియోజకవర్గాల్లో చెట్లు తక్కువగా ఉన్నా కల్లు వ్యాపారం మాత్రం మూడు చెట్లు.. 300 సీసాలు అన్న చందంగా సాగుతోంది. ప్రశ్నిస్తే పాత రికార్డులు తెరిచి గ్రామాల్లో ఈత వనాలు ఉన్నాయంటూ 50 సంవత్సరాల నాటి లెక్కలను నేటికి చూపిస్తూ పబ్బం గడుపుతున్నారు. ఈత చెట్లే లేకపోయినా ఈ ప్రాంతంలో భారీగా కల్లు ఉత్పత్తి జరుగుతోంది. ఈ కల్లు అంతా చెట్ల నుంచి వచ్చిన కల్లు అనుకుంటే పొరబడినట్లే. ఇక్కడ ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీలోకి చేరి కొందరు బడా కల్లు వ్యాపారులు నకిలీ కల్లు వ్యాపార కేంద్రాలు పెట్టుకుంటున్నారు. ప్రమాదకరమైన క్లోరైల్, హైడ్రేడ్, డైజోఫామ్ తదితర రసాయనాలను ఉపయోగించి కల్లు లాంటి తెల్లటి విషాన్ని తయారుచేసి మందుబాబులపై ప్రయోగిస్తున్నారు. దీనికి అలవాటుపడిన వారు తాగకుండా ఉండలేని పరిస్థితి. ఈ విషపు కల్లుతాగి క్రమంగా ఆరోగ్యం క్షీణించి ప్రాణాలు పోగొట్టుకుంటున్న అభాగ్యులు ఎందరో. గతంలో లేపాక్షి మండలం తిమ్మగానిపల్లి గ్రామంలో కల్తీకల్లు దొరక్కపోవడంతో దాదాపు 10 మందికిపైగా పిచ్చివాళ్లుగా మారిపోయారు. అందులో ఒక వ్యక్తి కాల్చుకుని చనిపోయాడు. మరికొంతమంది వింత వ్యాధితో బాధపడిన సంఘటనలు సైతం ఉన్నాయి. ప్రతినెలా కల్లు షాంపుల్స్ ప్రయోగశాలకు పంపిస్తున్నా అంతా సక్రమంగానే ఉన్నాయంటూ నివేదికలు వస్తున్నాయంటే కల్తీకల్లు మాఫియా ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా సెబ్, ఎక్సైజ్ శాఖలు సంయుక్తంగా అనుమతులు లేని కల్లు దుకాణాలపై దాడులు చేయాలి. అనుమతులు లేని వారిపై కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

తోపుదుర్తి బ్రదర్స్..నోరు అదుపులో పెట్టుకోండి

మాజీ మంత్రులు పరిటాల సునీత, కాలువ శ్రీనివాసులు

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి, రాయదుర్గం

తోపుదుర్తి బ్రదర్స్ నోరు అదుపులో పెట్టుకోవాలని, జగన్మోహన్‌రెడ్డి పాలనలో ప్రజాస్వామ్యానికి అడుగడుగునా అవరోధాలు ఎదురవుతున్నాయని మాజీ మంత్రులు పరిటాల సునీత, కాలవ శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల తీరును ఖండిస్తూ వారు టిడిపి నాయకులతో కలిసి రోడ్డుపై బైఠాయించి ఆదివారం నిరసన తెలిపారు. చెన్నేకొత్తపల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట మాజీ మంత్రి పరిటాల సునీత, సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులు బికె.పార్థసారధి, పరిటాల శ్రీరామ్ టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి నిరసన తెలియజేశారు. రాయదుర్గం పట్టణంలోని కనేకల్లు రోడ్డులో మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు బైఠాయించారు. ఈ సందర్భంగా వారు ఇటీవల రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోదరుడు చంద్రశేఖర్‌రెడ్డి టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ బాబుతో పాటు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, పత్రికా విలేకరులను అసభ్య పదజాలంతో దూషించడంపై మండిపడ్డారు. ప్రజాస్వామ్యం అంగీకరించని, పశుభాషతో మాట్లాడిన చంద్రశేఖర్‌రెడ్డిపై ఎందుకు ఇంతవరకు కేసు నమోదచేసి చర్యలు తీసుకోలేదని పోలీసులను ప్రశ్నించారు. తోపుదుర్తి సోదరులపైన టిడిపి కార్యకర్త గంటాపురం జగ్గు ప్రశ్నించినందుకు అర్ధరాత్రి అక్రమంగా అరెస్టు చేయడం ఏమిటని నిలదీశారు. స్టేషన్‌లో నిర్బంధించిన జగ్గును చూడటానికి వెళ్లిన ఆయన బంధుమిత్రులపై కనగానిపల్లి వైసిపి నాయకులు పాశవికంగా దాడిచేయడం దుర్మార్గం అన్నారు. టిడిపి కార్యకర్తలపై ఒక పక్క పోలీసులు, మరో పక్క వైసిపి నాయకులు దాడులు చేస్తే ఎక్కడికి వెళ్లి తలదాచుకోవాలని ప్రశ్నించారు. ఎస్ఐ ఎదుటే వైసిపి నాయకులు టిడిపి కార్యకర్తలపై దాడులు చేయడం హేయమైన చర్య అన్నారు. తమ రాజకీయ అనుభవంలో ఇలాంటి చెత్త ప్రభుత్వాన్ని తామెప్పుడూ చూడలేదని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పాశవిక నిర్బంధాలతో పోలీసు వ్యవస్థ ఏకపక్షంగా వైసిపి నాయకులకు కొమ్ముకాస్తోందన్నారు. ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపించడం మానేసి, పోలీసు వ్యవస్థను పూర్తిగా ప్రతిపక్ష నాయకులపైకి ఉసిగొల్పుతున్నాడని విమర్శించారు. పౌరుల కదలికలకు, స్వేచ్ఛకు భంగం కలిగించే హక్కు పోలీసులకు ఎవరిచ్చారని సూటిగా ప్రశ్నించారు. జగన్‌రెడ్డిని నమ్ముకుని పనిచేస్తున్న పోలీసు వ్యవస్థ భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. తక్షణమే చెన్నేకొత్తపల్లి ఎస్ఐ, సిఐ లను సస్పెండ్ చేయాలని, తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డిని అరెస్టు చేయడంతో పాటు కఠినంగా శిక్షించాలని, టిడిపి కార్యకర్తపై పెట్టిన తప్పుడు కేసులను తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. మీరు చెప్పిన విధంగా ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని డీఎస్పీ హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.



పోలీసులతో మాట్లాడుతున్న పరిటాల సునీత

మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు అరెస్ట్

టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులును రాయదుర్గంలో పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. చెన్నేకొత్తపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన ప్రదర్శనలో పాల్గొన్న మాజీ మంత్రి పరిటాల సునీతకు సంఘీభావం తెలిపేందుకు వెళతారన్న ఉద్దేశంతో కాలవ శ్రీనివాసులును పోలీసులు అడ్డుకున్నారు దీంతో ఆయన స్థానిక టిడిపి కార్యాలయం వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. పోలీసులు కాలవను అరెస్టు చేసి ఆయన స్వగృహానికి తరలించారు.

సకాలంలో బిల్లులు పాస్ చేస్తున్నాం

పిఆర్‌సి అమలులో ప్రథమ స్థానం జిల్లాదే..
జిల్లా ఖజానా శాఖ డిడి జె.సరళ విజయకుమారి





ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వ శాఖలు పంపుతున్న బిల్లులన్నీ సకాలంలో పాస్ చేసి ఆర్‌బిఐకు పంపడంలో జాప్యం లేకుండా పనిచేస్తూ ఉద్యోగులకు సకాలంలో జీతభత్యాలు అందించడంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ జె.సరళ విజయకుమారి తెలిపారు. ప్రజాశక్తితో ముఖాముఖి సందర్భంగా ఆమె అనే విషయాలు వెల్లడించారు. ఆ వివరాలు ఇలా..

ప్రశ్న : బిల్స్ పాస్ చేయడంలో జాప్యం జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మీరేమంటారు ?

జవాబు : సబంధిత శాఖ నుంచి బిల్స్ వస్తుంటాయి. ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు సదరు ఫార్మెట్‌లో బిల్స్ పెట్టి ఉంటే తక్షణమే పాస్ చేస్తున్నాం. చిన్న చిన్న పొరపాట్లు ఉంటే సరిచేసుకుని వచ్చిన వెంటనే పాస్ చేస్తున్నాం. ఎక్కడైనా బిల్ ఆగిందని తమ దృష్టి వస్తే ప్రత్యక్షంగా పరిశీలించి జరిగిన జాప్యం, అందుకు గల కారణాలను సదరు శాఖ అధికారులకు తెలియపరుస్తున్నాం. వాటిని సరిచేసి పంపితే వెంటనే బిల్లులు పంపుతున్నాం. జిల్లా ఖజానా శాఖ స్థాయిలో బిల్లులు ఆగే పరిస్థితి ఉండదు. ఫండ్ క్లియరెన్స్ ఉంటే సంబంధిత బిల్లులన్నీ సజావుగా పాస్ అవుతాయి.

ప్రశ : సర్వర్ సమస్య ఉందని విన్నాం.. నిజమేనా ?

జవాబు : సర్వర్ సమస్య అప్పుడప్పుడు ఉత్పన్నం అవుతుంది. బిల్స్ ఒకేసారి అప్‌లోడ్ చేయడంతో లోడ్ ఎక్కువ కావడం వల్ల సర్వర్ ఫ్రిక్వెన్సీ తక్కువ ఉండటం జరుగుతోంది. సాధ్యమైనంత వరకు అంతగా సమస్యలు తలెత్తలేదు. 5జి సదుపాయం పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే సర్వర్ సమస్య రాదు. సాంకేతిక సమస్యలు అందరికి సర్వసాధారణంగా వచ్చేవే. ప్రధాన శాఖ కావడంతో ప్రభుత్వం సర్వర్ సమస్య రాకుండా చర్యలు తీసుకుంటోంది.

ప్రశ్న : ఉద్యోగుల బయోమెట్రిక్ హాజరు జరుగుతోందా ?


జవాబు : గ్రామీణ స్థాయిలో నెట్ సమస్య కొంత ఉంది. కొండ, గుట్ట ప్రాంతాల్లో నెట్‌వర్క్ సరిగా రాదు. అయినా తమ ఉద్యోగులు ఎవరు ఎక్కడ ఏ పని చేస్తున్నారన్నది మాకు తెలిసిపోతుంది. బయోమెట్రిక్ హాజరు సరిగానే జరుగుతోంది. ఉద్యోగులు సమన్వయంతో పని చేస్తున్నారు. ఉద్యోగులు అందుబాటులో లేకపోతే తెలిసిపోతుంది. పని ఆగిపోతే తప్పకుండా సదరు ఉద్యోగి చేయాల్సి ఉంటుంది. కావున ఉద్యోగులు తమ విధులు సక్రమంగా నిర్వర్తిస్తున్నారు. అందుకే పిఆర్‌సి అమలులో జిల్లా ఖజానా శాఖ ప్రథమ స్థానంలో నిలిచింది. ఆర్‌టిసి ఉద్యోగుల ప్రభుత్వం విలీనం, వారి జీత భత్యాలు, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సదుపాయాలు వంటివి సకాలంలో పూర్తిచేసి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచాం.

ప్రశ్న : సిబ్బంది కొరత ఉందా ?

జవాబు : సిబ్బంది కొరతేమీ లేదు. ఉన్న ఖాళీలు ప్రభుత్వమే డీఎస్సీ ద్వారా భర్తీ చేస్తోంది. జిల్లా విభజన జగిగిన తరువాత పని విభజన జరగడం వల్ల కొంత సులభతరంగా మారింది. ఉద్యోగుల పదోన్నతుల విషయంలో కూడా రోస్టర్ పాయింట్ ఆధారంగా చర్యలు తీసుకుంటున్నాం. వేకెన్సీ ఆధారంగా ప్యానల్ ఆర్డర్ ప్రకారం అప్రూవల్ తీసుకుని చేస్తున్నాం.

కురుబలు ఐక్యంగా అన్ని రంగాల్లో రాణించాలి

ఆత్మీయ సమ్మేళనంలో వక్తల పిలుపు



సమ్మేళన సభలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

కురుబలు ఐక్యంగా అన్ని రంగాల్లో రాణించి ముందుకు సాగాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సాయి ఆరామంలో సత్యసాయి జిల్లా కురుబల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. అంతకుమునుపు హనుమాన్ సర్కిల్ నుంచి భారీ సంఖ్యలో కురుబలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సాయి ఆరామంలో భక్త కనకదాసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సామకోటి ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పెనుకొండ శాసనసభ్యుడు మాలగుండ్ల శంకర్ నారాయణ, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ ఎమ్మెల్యే, టిడిపి జిల్లా అధ్యక్షుడు బికె పార్థసారథి, మాజీ కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ సవితమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ కురుబ సంఘం జిల్లా కమిటీని ఏర్పాటు చేసి జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో కళ్యాణ మండపం, విద్యార్థులకు వసతిగృహం నిర్మించాలన్నారు. జిల్లాలో సుమారు 2.50 లక్షల కురుబ ఓటర్లు ఉన్నారన్నారు. కురుబలను అన్ని పార్టీలు గుర్తించి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రాజకీయంగా, ఆర్థికంగా, సాంఘికంగా ఎదగాలంటే కురుబలంతా ఒక తాటిపై నడవాలన్నారు. ఎమ్మెల్యే శంకర్ నారాయణ మాట్లాడుతూ రాజకీయంగా కురుబలకు ప్రాధాన్యత ఇచ్చింది వైసీపీ నేనని చెప్పగా, కురుబలు పెద్ద ఎత్తున అడ్డు తగిలారు. రాజకీయాలు మాట్లాడవద్దని కేకలు వేశారు. బి కె పార్థసారథి, సవితమ్మ సర్ది చెప్పడంతో సద్దుమునిగింది. ఎంపీ గోరంట్ల మాధవ్ కూడా వైసిపి కురుబలకు పెద్దపీట వేసిందని అనగానే సభలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అయింది. పార్థసారథి, సబితమ్మ మాట్లాడుతూ కురుబలు ఐక్యంగా తమ సంఘటిత శక్తిని నిరూపించుకోవాలన్నారు. కురుబల కళ్యాణ మండపానికి రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించడానికి అధికార పార్టీ నాయకులు చర్యలు తీసుకోవాలన్నారు. కళ్యాణ మండపానికి గోరంట్ల మాధవ్ తన ఎంపీ నిధుల నుంచి కోటి రూపాయలు మంజూరు మంజూరు చేయిస్తానని ప్రకటించగా, శంకర్ నారాయణ 10 లక్షలు ప్రకటించారు. ఈ సమావేశంలో కురుబ సంఘం నాయకులు కెటి. శ్రీధర్, మల్లికార్జున, కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ కోటిబాబు, బోరంపల్లి ఆంజనేయులు, కమ్మన్న, శివానంద, మాధవప్ప, కాటమయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలు

సిఐటియు జిల్లా కార్యదర్శి ఇఎస్ వెంకటేష్



సమావేశంలో మాట్లాడుతున్న ఇఎస్ వెంకటేష్

ప్రజాశక్తి-హిందూపురం

కార్మికుల సమస్యల పరిష్కారానికి రాజీ లేని పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియూ జిల్లా కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని కల్లూరు సుబ్బరావు పార్కులో సిఐటియు పట్టణ కమిటీ ఎంపిక కోసం అన్ని శాఖల నుంచి ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నూతన కమిటీని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జెడ్పీ శ్రీనివాసులు, ఇఎస్ వెంకటేష్ ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. పట్టణ అధ్యక్షులుగా జగదీష్, కార్యదర్శిగా నరసింహప్ప, కోశాధికారిగా రామకృష్ణతో పాటు 13 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతు ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే హిందూపురం అతిపెద్ద పారిశ్రామిక వాడ అన్నారు. ఇక్కడ దాదాపు 150 పరిశ్రమలు ఉన్నాయన్నారు. నూతనంగా ఎంపికైన కమిటీ అన్ని పరిశ్రమల కార్మికులను కలుపుకుని సంఘాన్ని మరింత విస్తరింప జేయాలన్నారు. అన్ని పరిశ్రమల్లో సంఘాన్ని ఏర్పాటు చేసి వారి సమస్యలను తెలుసుకుని, వారి పరిష్కారం కోసం ఉద్యమించాలన్నారు. సంఘ అభివృద్ధికి జిల్లా శాఖ తరపున అన్ని విధాలా సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజప్ప, రమణ, బాబావలి, అన్ని విభాగాల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

విఆర్‌కు కేరాఫ్ మడకశిర సర్కిల్




మడకశిర సర్కిల్ కార్యాలయం

ప్రజాశక్తి - మడకశిర

శాంతి భద్రతల పరిరక్షణలో ముందు ఉండాల్సిన పోలీస్‌శాఖకు చెందిన మడకశిర సర్కిల్ వివాదాలకు కేంద్రంగా మారింది. ఏకంగా సర్కిల్ స్థాయి అధికారులే విఆర్‌కు వెళుతున్నారు. ఇది ఆ శాఖలో చర్చనీయాంశంగా మారింది. దీంతో పోలీసు వ్యవస్థపై ఈ ప్రాంతంలో నమ్మకం సడలిపోతోంది. కర్నాటక సరిహద్దులో ఉన్న ఈ సర్కిల్ సమస్యాత్మక ప్రాంతంగా ఉంది. గతంలో సరిహద్దు అవతల జరుగుతున్న మొబైల్ గ్యాంబ్లింగ్, మట్కా నేడు ఆయా మండల కేంద్రాలకు కూత వేటు దూరంలో పుట్టగొడుగుల వెలుస్తూ రోజు లక్షలాది రూపాయలు చేతులు మారుతున్న వైనం కలవర పెడుతోంది. అంతేకాకుండా ఏ సర్కిల్ స్థాయి అధికారి ఇక్కడికి వచ్చిన పట్టుమని పది నెలలు గడవకముందే విఆర్‌కు వెళ్లడమో, లేక బదిలీ కావటమో జరుగుతోంది. ముఖ్యంగా ఇక్కడ పని చేసే అధికారుల విధి నిర్వహణ కత్తిమీద సాములా తయారవుతోంది. ఇక్కడ పనిచేయాలంటే ఖాకీ దుస్తులు పక్కన పెట్టాలి, లేదా ఖాకీ ముసుగులో ఖద్దర్ వేసుకుంటే తప్ప పనిచేయలేని పరిస్థితులు ఇక్కడ ఉన్నాయన్న అభిప్రాయాలు అధికారుల్లో వెల్లడవుతున్నాయి. ఇటీవల అంగన్వాడీ పోస్టుల నియామకంలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ టిడిపి ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యాలయ ముట్టడి కార్యక్రమం చేపట్టారు. ఈ నేపథ్యంలో పరస్పర ఆరోపణలు తారస్థాయికి చేరి పాలక, ప్రతిపక్ష పార్టీ నాయకుల ఇళ్ల ముట్టడికి దారితీశాయి. ఈ విషయంలో పాలక నేతకు, సిఐకు మధ్య కొద్ది పాటి మనస్పర్ధలు చోటుచేసుకున్నాయన్న వ్యాఖ్యానాలు విన్పించాయి. ఈ నేపథ్యంలోనే

వివాదాల్లో చిక్కుకొని విఆర్‌కు వెళ్లిన పలువురు సిఐలు, ఎస్ఐలు



సర్కిల్ స్థాయి అధికారికి విఆర్ వేటు పడినట్లు విశ్వసనీయ సమాచారం. ఇది ఇలా ఉండగా ఐదు సంవత్సరాల వ్యవధిలో వచ్చిన ప్రతి సిఐ విఆర్‌కు వెళ్తుండడం ఆ శాఖ సిబ్బందిలో గుబులు రేపుతోంది. అధికారి వచ్చి బాధ్యతలు చేపట్టి పట్టు బిగించే లోపే ఇలా విఆర్‌కు వెళుతుండటం ఆ శాఖ సిబ్బందిలో ఆందోళన నెలకొంది. దీంతో పాటు ప్రజల్లో పోలీసు వ్యవస్థపై నమ్మకం సడలుతోంది. ఓ అధికారి ఇక్కడ పని చేయాలంటే కేవలం అధికార పార్టీ నేతల కనుసన్నల్లో మెలగాల్సిన పరిస్థితి ఉందన్న వాదనలు వినపడుతున్నాయి. విధినిర్వహణలో న్యాయం వైపు కాకుండా అధికార పార్టీ వైపు మొగ్గుచూపితే ప్రయివేటు కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందన్న ఆందోళన అధికారుల్లో నెలకొంది. ప్రస్తుతం విఆర్ వేటుకు సిఐ నాగరాజు రావు గురయ్యారు. అంత కు మునుపు పనిచేసిన సిఐలు శ్రీరామ్, దేవానంద్ , రాజేంద్రప్రసాద్, దేవేంద్ర కుమార్, శుభకుమార్ ఇలా ప్రతి ఒక్కరూ వి ఆర్‌కు వెళ్లడం ఆ శాఖలో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు ఇదే బాటలో ఎస్ఐలు సైతం వెళుతూ ఉండడం గమనార్హం. తాజాగా రెండు పర్యాయాలు శేషగిరి పై వి ఆర్ వేటు పడింది. అదేవిధంగా శరత్‌చంద్ర, గుడిబండ మస్తాన్, సుదాకర్ యాదవ్ ఇలా విఆర్ కు వెళుతుండడం చూస్తే ఇక్కడ పని చేసిన అధికారుల విధి నిర్వహణపై ప్రజలకు అనుమానాలు వస్తున్నాయి. ఉన్నతాధికారుల చర్యల మూలానా వీరిపై ప్రజల్లో అనుమానాలను తలెత్తేలా చేస్తున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లో ఇల్లు దగ్ధం

బత్తలపల్లి : మండలంలోని పోట్లమర్రి గ్రామంలో ఆదివారం జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ముత్యాలప్ప అనే వ్యక్తికి చెందిన ఇల్లు దగ్ధమైంది. దీంతో రూ. 3లక్షలకు పైగా ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు వాపోయాడు. ఈ ఘటనకు సంబందించిన వివరాలు.. గ్రామానికి చెందిన ముత్యాలప్ప తన వ్యక్తిగత పనులపై బత్తలపల్లికి వచ్చాడు. ఆయన భార్య నాగలక్ష్మి ఇంటికి తాళం వేసి పొలం వద్దకు వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటిలో నుంచి పొగలు వెలువడుతుండటంతో గ్రామస్తులు తన ఇంటికి సరఫరా అయ్యే విద్యుత్ కనెక్షన్ తొలగించారు. తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి నీరు చల్లి మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఇంట్లోని ఫ్రిజ్, బియ్యం ప్యాకెట్లు, నగదు, ఇంటి సామాగ్రి కాలిబూడిద అయిందని బాధితుడు వాపోయారు. తనను ఆదుకోవాలని ఆయన కోరాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు, మండల కన్వీనర్ బయపరెడ్డి కాలిన ఇంటిని పరిశీలించారు ప్రభుత్వ నుంచి ఆర్థిక సాయం అందేలా చూస్తామని బాధితుడికి హామీ ఇచ్చారు.

జగ్గూని కఠినంగా శిక్షించాలి : వైసిపి

చెన్నేకొత్తపల్లి : జగ్గుని కఠినంగా శిక్షించాలని వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి కుటుంబ సభ్యులను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన జగ్గుని పోలీసులు అరెస్టు చేస్తే ఆయనకు మద్దతుగా చెన్నైకొత్తపల్లి స్టేషన్ ముందు పరిటాల సునీత, బి.కె పార్థసారథి, పరిటాల శ్రీరామ్ తదితరులు ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న రాప్తాడు నియోజకవర్గం లోని వైసిపి శ్రేణులు భారీ ఎత్తున చెన్నేకొత్తపల్లికి చేరుకున్నారు. ఈ సందర్భంగా రాప్తాడు నియోజకవర్గం వైసీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కిరాయి గూండాల కోసం పరిటాల సునీత, పార్థసారథి, పరిటాల శ్రీరామ్ లాంటి వాళ్ల ధర్నాలు చేయడం సిగ్గుచేటన్నారు. తల్లి, తండ్రి, చెల్లి అందర్నీ ఒకేలా మాట్లాడుతున్న కిరాయి హంతకుడు జగ్గు అనిఅలాంటి వాళ్లకు మద్దతు ఇవ్వడం దారుణమని విమర్శించారు.

ఘనంగా బనుమయ్య జయంతి

అమరాపురం : కర్నాటకకు చెందిన ప్రముఖులు ప్రభు రావ్ బహుద్దూర్ కెంపేగౌడ బనుమయ్య జయంతి వేడుకలను మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానికసాయి విద్యానికేతన్ ఆవరణంలో కుంచిటిగ వక్కలిగ సేవా సమితి అధ్వర్యంలో కెంపేగౌడ బనుమయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. ఈ కార్యక్రమంలో మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న కుంచిటిగ వక్కలిగ సామాజికవర్గానికి చెందిన పలువ9రు పాల్గొన్నారు.

రాజ్యాంగం పట్ల అవగాహన కలిగివుండాలి

కదిరి టౌన్ : విద్యార్థులు రాజ్యాంగం పట్ల అవగాహన కలిగి ఉండాలని న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వెంకటేశ్వరరావు విద్యార్థులకు సూచించారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కదిరి గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాజ్యాంగ కల్పించిన హక్కుల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సమావేశంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి పి మీనాక్షి సుందరి , న్యాయవాదుల సంఘం అధ్యక్షులు లోకేశ్వర్ రెడ్డి, సీనియర్ న్యాయవాది నరసింహులు, శ్రీనివాస్‌తో పాటు పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

కొత్తచెరువు : పుట్టపర్తి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని వైసిపి రాష్ట్ర సిఇసి సభ్యులు డాక్టర్ కొత్తకోట సోమశేఖర్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని తలమర్ల గ్రామంలో ఆయన ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఎస్సీ కాలనీలో ప్రజల అవసరాల కోసం ఆయన గతంలో బోరు వేయించారు. ఆ నీరు ఇప్పుడు ఉప్పునీరుగా మారాయని ఇక్కడ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి శుద్ధ జలాలని అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి గోవిందరెడ్డి, సంజీవరెడ్డితో పాటు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బిసి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు

తనకల్లు : మండల పరిధిలోని కొక్కంటి క్రాస్ కు చెందిన సోంపాళ్యం నాగభూషణంను బీసీ సంక్షేమ సంఘం సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఆదివారం ఉమ్మడి అనంతపురం జిల్లాలో బీసీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. శంకర్‌రావు, ప్రధాన కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 14 నియోజకవర్గాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, 63 మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

గోరంట్ల : పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల నందు 1986 87 సంవత్సరంలో పదో తరగతి బ్యాచ్ లో చదివిన పట్టణానికి చెందిన ఎరుకల నారాయణస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టెన్త్ క్లాస్ బ్యాచ్‌కు చెందిన మిత్రులు మృతుడి కుటుంబానికి ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. రూ. 1.61 లక్షల నగదును మృతునిభార్య శంకరమ్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మృతుడి మిత్రులు శ్రీనాథ్, విజయ శేఖర్, ప్రభాకర్ రెడ్డి, మురళి, రామకృష్ణ, అజ్మతుల్లా, సంజయ్, వెంకటేష్, రణధీర్, జగదీష్, రంగారావు, సుధీర్, విజయలక్ష్మి, నిర్మల తదితరులు పాల్గొన్నారు

నేడు సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ

గోరంట్ల : రబీలో పంటసాగు చేసే అర్హులైన రైతులకు సబ్సిడీ విత్తన వేరుశనగను సోమవారం మండలకేంద్రంలో పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా తెలిపారు. వేరుశనగ విత్తనాలు కావలసిన రైతులు పట్టాదారు పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ బిల్లు జిరాక్స్ తీసుకుని రావాలని కోరారు. ఒక్కొక్క రైతుకు మూడు బస్తాలు వేరుశనగను ఇస్తామన్నారు. బస్తా ధర రూ. 1,540లు అని తెలిపారు.

బలిజలకు ప్రాధాన్యత కల్పించాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

2024 ఎన్నికలలో టిడిపి తరపున పుట్టపర్తి అసెంబ్లీ టికెట్‌ను బలిజలకు కేటాయించాలని సీనియర్ నాయకుడు పెదరాసు సుబ్రహ్మణ్యం కోదారు. ఈ మేరకు ఆదివారం ఆయనతో పాటు మరికొందరు నాయకులు విజయ వాడలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నా యుడును కలిసి విన్నవించారు. పుట్టపర్తి నియోజ కవర్గంలో సుమారు 45 వేల మంది బలిజలు ఉన్నారన్నారు. తాను మొదటి నుంచి టిడిపిలో ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నానన్నారు. తన భార్య లక్ష్మీదేవి బుక్కపట్నం ఎంపీపీగా సేవలందించిందన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం కృషి చేసిన తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరినట్లు ఆయన అక్కడి నుంచి ఫోన్లో చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పల్లపు జయచంద్ర మోహన్ తదితరులు ఉన్నారు.


అచ్చెన్నాయుడితో మాట్లాడుతున్న పెదరాసు సుబ్రమణ్యం తదితరులు

కబేళాలపై దాడులు



అక్రమ నిర్మాణదారులతో మాట్లాడుతున్న పోలీసులు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని పరిగి రోడ్డులో దుర్వాసన వస్తున్నదని స్థానిక ప్రజలతో పాటు ప్రజాప్రతినిధులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు వెంటనే స్పందించారు. పోలీసు అధికారులతో కలిసి శనివారం అర్ధ రాత్రి ఆకస్మిక దాడులు నిర్వహించి, అనుమతులు లేని షెడ్డులను జెసిబితో తొలగించే చర్యలు చేపట్టారు. కొంత మంది వ్యాపారులు ఎటువంటి అనుమతులు లేకుండా షెడ్లను నిర్మాణం చేసుకుని, ఆ షెడ్డులలో ఆవులను, ఎద్దులను వధించి ఎగుమతులకు పాల్పడుతున్నారు. వీటిని గతంలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు పరిశీలించి షెడ్లను తొలగించి, మున్సిపల్ శాఖ కేటాయించిన స్థలంలో కబేళాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అయితే వ్యాపారులు అక్కడికి వెళ్లకుండా అవే షెడ్లలో జంతువులను వధిస్తున్నారు. ఈనేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ శనివారం అర్ధరాత్రి మున్సిపల్ సిబ్బంది, పోలీస్ అధికారులు, సచివాలయ సిబ్బందితో దాడులు నిర్వహించి షెడ్లను తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతు పట్టణంలో ఆవులను, ఎద్దులతో పాటు గొర్రెలు, పొట్టేళ్లు వధించే వారు తప్పని సరిగా పశువైద్యాధికారి అనుమతి తీసుకోవాల్సుందన్నారు. అయితే ఇక్కడ కొంత మంది ఎటువంటి అనుమతులు లేకుండా అనధికారికంగా కబేళాలు ఏర్పాటు చేసి గోవులను, ఎద్దులను వధించి మాంసాన్ని బెంగళూరు, ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు చేస్తున్నారన్నారు. ఇది నేరం అన్నారు. వీరిపై కేసులను నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇకపై అనమతులు లేకుండా కబేళాలను నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

తోపుదుర్తి వ్యాఖ్యలకు నిరసనగా టిడిపి ఆందోళన

కదిరి టౌన్ : టిడిపి జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా టిడిపి నాయకులు పట్టణంలో ఆదివారం ఆందోళన చేపట్టారు. పట్టణంలోని పూలే విగ్రహం ఎదుట టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో రోడ్డుపై బైటాయించి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా కందికుంట మాట్లాడుతూ చంద్రబాబుపై చేసిన అనుచిత వ్యాఖ్యలు ఉపసంహరించకపోతే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. పోలీసుల వ్యవహార శైలిని ఆయన తప్పుపట్టారు. పద్ధతులు మార్చుకోకపోతే న్యాయస్థానాలు ఆశ్రయించి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రాజశేఖర్ బాబు, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు బాబ్జాన్, పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనుకొండ : రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి సోదరుడు తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు కి బహిరంగ క్షమాపణ చెప్పాలని టిఎన్ఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి చంద్రబాబు నాయుడు గురించి అసభ్య పదజాలంతో మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధికార ప్రతినిధి హరీష్, పెనుకొండ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సాయికిరణ్, కార్యనిర్వాహక కార్యదర్శి షబ్బీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ఈరన్న డిమాండ్ చేశారు. ఈసమవేశంలో మాజీ జెడ్పీటీసీ పాండురంగప్ప, మాజీ ఎంపీపీ ఆదినారాయణ, రవిభూషణ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు . అదే విధంగా స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబుకు బే షరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ దాసిరెడ్డి, గురుమూర్తి, నరసింహప్ప, పట్టణ అధ్యక్షులు మనోహర్, ఈరన్న తదితరులు పాల్గొన్నారు .

పుట్టపర్తి అర్బన్ : రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి తమ్ముడు చంద్రశేఖర్ రెడ్డి టిడిపి అధినేత చంద్రబాబు కుటుంబ సభ్యులపై అసభ్య పదజాలంతో దూషించినందుకు ఆయనపై కేసు నమోదు చేయాలని రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి అంబులెన్స్ రమేష్ డిమాండ్ చేశాడు. ఈ మేరకు ఆయన ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. తక్షణం పోలీసులు కేసు నమోదు చేయాలని లేని పక్షంలో తెలుగు యువత ఆందోళన చేస్తుందని హెచ్చరించారు.

అర్ధరాత్రి గంటాపురం జగ్గు అరెస్టు


బాధితుడిని పరామర్శిస్తున్న పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి - చెన్నేకొత్తపల్లి

గంటాపురం జగ్గు వ్యాఖ్యల నేపథ్యంలో పోలీసులు శనివారం అర్ధరాత్రి గంటాపురం వెళ్లి జగ్గును అరెస్టు చేశారని ఆందోళన చెందిన తాము జగ్గును వెతుక్కుంటూ మరో వాహనంలో వస్తే వైసిపి నాయకులు దాడికి పాల్పడ్డారని జగ్గు కుటుంబసభ్యులు విమర్శించారు. రాప్తాడు ఎమ్మెల్యే ఒత్తిడి మేరకే పోలీసులు జగ్గును అర్ధరాత్రి అరెస్టు చేసి ధర్మవరంతో పాటు పలు పోలీస్ స్టేషన్లు తిప్పి చివరకు చెన్నేకొత్తపల్లి తీసుకెళ్లారని అన్నారు. విషయం తెలుసుకున్న తాము చెన్నేకొత్తపల్లికి వెళు తుండగా కనగానపల్లి మండల వైసిపి కన్వీనర్ అమర్నాథ్ రెడ్డి, ఎస్టీడీ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కొంతమంది వైసిపి నాయకులు, కార్యకర్తలు కాపు కాసి తమపై మారుణాయుధాలతో దాడి చేసి తమ వాహనాన్ని ధ్వంసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో తీవ్ర గాయాలపాలైన తాము ప్రాణాలు రక్షించుకునేందుకు ప్రయత్నించామని అన్నారు. పోలీసుల సమక్షంలోనే ఈ దాడులు జరిగాయని వారు ఆరోపించారు. ధ్వంసమైన తమ వాహనాన్ని పోలీసులు ధర్మవరం పరిధిలోని కేతిరెడ్డి కాలనీ వద్ద వదిలేసి వెళ్లిపోయారన్నారు.

పరిటాల శ్రీరామ్ పరామర్శ

అర్ధరాత్రి జరిగిన ఈ సంఘటన గురించి తెలుసుకున్న మాజీ మంత్రి పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ నేరుగా రంగంలోకి దిగారు. బాధితులను ఎక్కడున్నారో తెలుసుకుని వారిని ఆసుపత్రికి తరలించారు. ఇక జగ్గు అరెస్టుకు నిరసనగా చెన్నేకొత్తపల్లికి వెళ్లి ఆందోళనకు దిగారు. ఎమ్మెల్యే సోదరున్ని దూషించారన్న కేసులో అరెస్టు అయిన గంటాపురం జగ్గును ధర్మవరం పోలీసులు న్యాయమూర్తి ఎదుట రెండుసార్లు ప్రవేశ పెట్టగా ఈ కేసుకు సంబంధించి పోలీసులే స్టేషన్ బెయిల్ ఇవ్వవచ్చని న్యాయమూర్తి పోలీసులకు సూచించినట్లు తెలిసింది. అంతకుముందు ఆసుపత్రిలో వైద్య పరీక్షల సమయంలో జగ్గును పరిటాల శ్రీరామ్ పరామర్శించారు. జరిగిన సంఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడవద్దని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

భవన కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - తలుపుల

భవన కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాననిసొంత నిధులతో భవనం నిర్మించిఇస్తానని భవన నిర్మాణరంగ కార్మికుల సంఘం గౌరవాధ్యక్షులు, తలుపుల ఉపసర్పంచి చింతకుంట కృష్ణారెడ్డి అన్నారు. స్థానిక జూనియర్ కళాశాల ఆవరణంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో భవన నిర్మాణరంగ కార్మికుల సంఘాన్ని ఎన్నుకున్నారు. ఈ సంఘానికి గౌరవాధ్యక్షులుగా ఎన్నికైన చింతకుంట కష్ణారెడ్డి (డీకేబాబు) మాట్లాడుతూ కార్మికులకు ఏ కష్టం వచ్చినా 24 గంటలు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తానని అన్నారు. అలాగే కార్మికుల కోరిక మేరకు తలుపుల మండలంలో తన సొంత నిధులతో భవనం నిర్మిస్తానని చెప్పారు. అధ్యక్షులు మహబూబ్ బాషా మాట్లాడుతూ తనను అధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాలూకా అధ్యక్షులు నాగరాజు, ఉపాధ్యక్షులు గణేష్, కార్యదర్శి ఖాదర్ ఖాన్, కోశాధికారి బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - నంబుల పూలకుంట

మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లే రహదారి వద్ద కరెంటు తీగ చేతికందే ఎత్తులో ఉంది. హైస్కూల్ సమీపంలోని ఈ ప్రాంతం మీదుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. చేతికందే ఎత్తులో ఉన్న ఈ విద్యుత్ తీగల వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని వారు భయాందోళన చెబుతున్నారు. చేతికందే ఎత్తులో ఉన్న విద్యుత్‌తీగ సమస్యపై గతంలో జరిగిన సర్వ సమావేశంలో సభ్యులు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అయితే ఇప్పటిదాకా కూడా అధికారులు స్పందించలేదు. ఏదైనా ప్రమాదం జరిగితే తప్ప అధికారులు స్పందించారా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాద స్థితిలో ఉన్న వైర్లు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

29 నుంచి సైన్స్ పోటీలు

కొత్తచెరువు : స్థానికజిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 29, 30వ తేదీలలో జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లాస్థాయి పోటీలు విద్యార్థులకు నిర్వహిస్తున్నట్లు డిఇఒ మీనాక్షి తెలిపారు 29వ తేదీ పుట్టపర్తి, నల్లమాడ, కదిరి, మడకశిర, గుడిబండ, ముదిగుబ్బ, రామగిరి, కనగానపల్లి, సికేపల్లి, పరిగి, హిందూపురం, లేపాక్షి, ఎన్.పి కుంట, రొద్దం, నల్లచెరువు పెనుకొండ మండలాలకు చెందిన విద్యార్థులకు సైన్సు కాంగ్రెస్ పోటీలు నిర్వహిస్తామన్నారు. 30వ తేదీ మిగిలిన మండలాలైన బుక్కపట్నం, కొత్తచెరువు, అమరాపురం, చిలమత్తూరు, ఓడి చెరువు, తనకల్లు, అమడగూరు, అగళి, గోరంట్ల, తాడిమర్రి, గాండ్లపెంట, బత్తలపల్లి, రొళ్ల, ధర్మవరం, సోమందేపల్లి, తలుపుల మండలాలకు చెందిన విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తామని చెప్పారు.

రోడ్లపై మురుగు

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల కేంద్రంలోని పలు కాలనీల్లో రోడ్లపై మురుగునీరు నిల్వ ఉంటోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వినాయక్ నగర్ లోగల మురుగుకాలువలో చెత్త పేరుకుపోయి మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుంది. దీంతో ఆ ప్రాంతంలో దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు విజృంభించడంతో రోగాలబారిన పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. సమస్యను పలుమార్లు పంచాయతీ సిబ్బందికి తెలియజేసిన పట్టించుకోవడంలేదని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.


రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

ఆ పాఠశాలలో విద్యార్థులే పనిమనుషులు

ప్రజాశక్తి రొద్దం

మండలంలోని స్థానిక మహాత్మ జ్యోతిరావ్ పూలే గురుకుల పాఠశాల సిబ్బంది విద్యార్థులతో పలుగు పార పట్టించి కూలి పనులు చేయిస్తున్నారు. పిల్లలను విద్యావంతులుగా మార్చాల్సిన ఉపాధ్యాయులే వారిని కూలీలుగా మారుస్తున్నారన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. చిన్నారుల చేతులకు కాయలు కాసేలా పనులు చేయిస్తున్నారు. మహాత్మా జ్యోతిరావుపూలే పాఠశాలలో చదువుతున్న విద్యార్థులతో పాఠశాల ముందర ఉన్న చెట్ల చుట్టూ గడ్డిని తొలగించే పనిని ఆదివారం చేపట్టారు. పలుగు గడ్డపార చేత పనులు చేయించారు. ఆ పనిముట్లను ఎలా వాడాలో కూడా తెలియని విద్యార్థులతో ఆ పనులు చేయిస్తే ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది. ఆదివారం కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను చూసేందుకు వచ్చారు. కానీ సిబ్బంది అవేవీ పట్టించుకోకుండా కనీసం వారి తల్లిదండ్రులతో కూడా కాసేపు మాట్లాడనివ్వకుండా పనులు చేయించారు. అది చూసిన విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చెందారు. సంబందిత శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


పాఠశాల ముందు గడ్డిని తొలగిస్తున్న విద్యార్థి

జోరుగా ఫుట్‌పాత్ వ్యాపారాలు

ప్రజాశక్తి, పుట్టపర్తి అర్బన్

సత్యసాయి జయంతి వేడుకలు సందర్భంగా ఫుట్ పాత్ పై పలు దుకాణాలు వెలిశాయి. పట్టణంలోని విద్య గిరి నుంచి ఈశ్వరమ్మ ఉన్నత పాఠశాల వరకు వివిధరకాల వస్తువులు బెలూన్లు, చిన్నపిల్లలు ఆడుకునే బొమ్మలు, బంతులు, షట్టర్లు, రబ్బర్ వస్తువులు, ప్లాస్టిక్ వస్తువులు ఇలా పెద్దలకు పిల్లలకు ఉపయోగపడే వస్తువులు విక్రయిస్తున్నారు. పుట్టపర్తి పరిసర ప్రాంతాల ప్రజలు ముఖ్యంగా మహిళలు, పిల్లలు ఉదయం సాయంత్రం వీటిని కొనడానికి ఆసక్తి చూపుతున్నారు. ఈనెల 18 నుంచి 24 వరకు జయంతి ఉత్సవాలు జరిగిన విషయం విధితమే. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి చిరు వ్యాపారులు తమ వస్తువులు విక్రయించుకోవడానికి పలువురు వచ్చారు. వ్యాపారాలు ఎలా ఉన్నాయని వ్యాపారులను విచారించగా పరిసర గ్రామాల ప్రజలు, మహిళలు, పిల్లలు వస్తువులను కొనటానికి ఆసక్తి చూపుతున్నారన్నారు. తమకు కూడా గిట్టుబాటు అవుతోందని మరో వారం పది రోజులపాటు తమ వ్యాపారాలు కొనసాగుతాయని తెలిపారు.


ఫుట్‌పాత్‌మీద జరుగుతున్న వ్యాపారాలు